సంపుటి : 9
సంచిక : 307
గురువారం
30 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT
CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

'ఇంటింటికి తెలుగుదేశం'.. మూడు రోజుల్లో

## 6.20 లక్షల ఇళ్ల సందర్శన

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం -2026" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా మూడో రోజూ విజయవంతంగా కొనసాగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, ఇంటింటికీ వెళ్లి.. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల ఇళ్లను చుట్టేయగా.. మొత్తం మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లను సందర్శించాయి. నియోజకవర్గాల వారీగా మిగతా .. 2లో..

జగన్ పర్యటనలో జన సమీకరణ చేస్తే

## చట్టపరమైన చర్యలు

శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి



శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా అధినేత జగన్ గురువారం శ్రీకాకుళంలో పర్యటించనున్నారు. అంపోలు జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో ఆయన ములాఖత్ కానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ పర్యటనకు మిగతా .. 2లో..

ఇథనాల్ వాడితే.. ఆ పరికరాలు

## మార్చాల్సి రావొచ్చు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



విశ్వం వాయిస్ న్యూస్ : ఈ20 పెట్రోల్ వినియోగించే (2016కు ముందు తయారైన) బీఎస్-3 వాహనాల్లో చిన్న పాటి రిపేర్లు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి రావచ్చని తెలిపింది. వాహన పనితీరు, మన్నిక, మైలేజీని అది అధిక స్థాయిలో ప్రభావితం చేయదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మిగతా .. 2లో..

ఏపీలో వర్షాలు..


## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏపీఎస్‌డీఎంఏ డైరెక్టర్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశాపై తీవ్రవాయుగుండం కదులుతోంది. ఇది రాబోయే 24 గంటల్లో ఛత్తీస్‌గఢ్ - మధ్యప్రదేశ్ మీదుగా ప్రయాణించే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో వాతావరణం మిగతా .. 2లో..



ఏపీలో పెట్టుబడులకు

# తైవాన్ ఆసక్తి

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వేర్వేరుగా భేటీ అయిన తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులు
- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు
- రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి
- ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై కీలక ఒప్పందాలు
- తయారీ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకారం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జీలీ కన్‌స్ట్రక్షన్స్ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న సానుకూల వాతావరణాన్ని వారికి వివరించారు.



ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, విమానాశ్రయాలు, పటిష్టమైన రోడ్డు, రైలు మార్గాల ద్వారా బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రం కలిగి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పూర్తిస్థాయి ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. భారత్‌లో తమ దేశ సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మిగతా .. 2లో..

ఆళ్లగడ్డలో ఏం జరిగినా

## సెన్సేషన్‌గా మారుతోంది

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఏ చిన్న వివాదం తలెత్తినా పార్టీ దృష్టికి తీసుకురావాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సూచించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే. దీనిపై అధిష్ఠానం వివరణ కోరిన నేపథ్యంలో పల్లా శ్రీనివాస్‌తో ఆమె భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో అఖిలప్రియ మాట్లాడారు. "ఆళ్లగడ్డలో ఏం జరిగినా పెద్ద సెన్సేషన్‌గా మారుతోంది. నిజానిజాలు తెలియకుండా సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేస్తున్నారు. నేను మిగతా .. 2లో..

ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్

## పకడ్బందీగా ఉండాలి

జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
సెప్టెంబర్ 15న 3,168 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల - 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన
ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం : విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం మిగతా .. 2లో..

## ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

పార్వతీపురం మన్యం జిల్లా గుచ్చిమిలో కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభం
మానవ-గజరాజుల ఘర్షణ నివారణకు ఇది కొత్త అధ్యాయం అన్న పవన్ కల్యాణ్
పలమనేరు తరహాలో ఇక్కడా సమస్యను పరిష్కరిస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రభుత్వం
నాలుగు కుంకీలను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు



పార్వతీపురం, విశ్వం వాయిస్ న్యూస్ : ఉత్తరాంధ్రలో ఏళ్ల తరబడి రైతులను, ప్రజలను భయపెడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ శిబిరం ఏర్పాటు ఉత్తరాంధ్రలో మిగతా .. 2లో..

రైతు కుటుంబాలకు

## నిజమైన భరోసా 'పంట బీమా'

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతు కుటుంబాలకు 'పంట బీమా' నిజమైన భరోసా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా నమోదుకు జులై 31వ తేదీతో గడువు ముగుస్తున్నందున.. రైతులందరూ వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గడువు ముగిసిన తర్వాత నమోదుకు అవకాశం ఉండకపోవచ్చని, రైతులు చివరి రోజు వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ప్రక్రియ మిగతా .. 2లో..

ఎప్పటికీ వారికి

## క్షమాపణ చెప్పను

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



విశ్వం వాయిస్ న్యూస్ : ఢిల్లీలో ఇటీవల విద్యార్థులపై జరిగిన దాడికి కేంద్ర హోంశాఖ మంత్రి కారణమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ శాఖను నిర్వహిస్తున్న అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, విద్యార్థులపై జరిగిన దాడులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. తాను మాట్లాడేందుకు మిగతా .. 2లో..

చంద్రబాబును ఎదుర్కోలేక

## నన్ను లక్ష్యంగా చేసుకున్నారు

వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి తీవ్ర విమర్శలు



కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ : టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో చంద్రబాబును నేరుగా ఎదుర్కోలేక తనను రాజకీయాల్లోకి లాగి వ్యక్తిగతంగా అవమానించారని ఆరోపించారు. ధైర్యం ఉంటే ప్రత్యర్థిని నేరుగా ఎదుర్కోవాలని, మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా ద్రౌపది మాత ఆలయాన్ని బుధవారం సందర్శించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మహాభారతంలో మిగతా .. 2లో..

## మేమేమైనా అంటరానివాళ్లమా?

చంద్రబాబుపై అంబటి రాంబాబు ఫైర్



విశ్వం వాయిస్ న్యూస్ : ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో తన పక్కన కూర్చున్నందుకు టీడీపీ నేత బొండా ఉమాకు ఆ పార్టీ అధిష్ఠానం నోటీసులు ఇవ్వడంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు విరుచుకుపడ్డారు. పార్టీలు వేరైనా కాపు సామాజికవర్గ కార్యక్రమాల్లో నేతలు కలవడం సహజమని, అంతమాత్రానికే బొండా ఉమా నుంచి వివరణ కోరడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. తామిద్దరం పక్కపక్కనే మిగతా .. 2లో..

గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతే

## అత్యంత ప్రాధాన్యం : భారత్



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీవ్రంగా ఖండించింది. హింసాత్మక ఘటనలు వెంటనే నిలిపివేసి, అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో మిగతా .. 2లో..

## 'వందేమాతరం'పై బిల్లును ఆమోదించిన రాజ్యసభ



విశ్వం వాయిస్ న్యూస్ : జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ఏపీలో పెట్టుబడులకు

# తైవాన్ ఆసక్తి

కార్యకలాపాలు విస్తరించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.

**మంత్రి లోకేశ్ తో నైపుణ్యాభివృద్ధిపై చర్చలు**

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తో తైవాన్ ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా మానవ వనరుల అభివృద్ధి, ఏపీ యువతకు నైపుణ్యాల కల్పనపై చర్చించారు. తైవాన్ తయారీ, సాంకేతిక రంగాల్లోని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యా భాగస్వామ్యంపై లోకేశ్ వారితో విస్తృతంగా మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడం, యువతకు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలపై కూడా చర్చలు జరిగాయి. ఏపీ, తైవాన్ మధ్య సంబంధాలలో ఈ సమావేశాలు ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పారిశ్రామిక పెట్టుబడులతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### 'ఇంటింటికి తెలుగుదేశం'.. మూడు రోజుల్లో

# 6.20 లక్షల ఇళ్ల సందర్శన

కార్యక్రమ పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కుప్పంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వసనాడు, వేపూరు గ్రామాల్లో మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.

### జగన్ పర్యటనలో జన సమీకరణ చేస్తే

# చట్టపరమైన చర్యలు

జన సమీకరణ చేయకూడదని చెప్పారు. జైలులో ములాఖత్ కోసమే అనుమతి తీసుకున్నారన్నారు. బహిరంగ సభ, ర్యాలీకి అనుమతి తీసుకోలేదని.. జన సమీకరణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ చేసిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు సాక్ష్యాలను తారుమారు చేశారంటూ అప్పలరాజుపైనా కేసు నమోదైంది. ఇటీవల పోలీసులు అయన్ను అరెస్ట్ చేయగా.. కోర్టు రిమాండ్ విధించింది. దీంతో అప్పలరాజును అంపోలు జైలుకు తరలించారు.

### ఇథనాల్ వాడితే.. ఆ పరికరాలు

# మార్చాల్సి రావొచ్చు

రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఐఓసీఎల్, ఐఐపీ- డెహ్రాడూన్, సియామ్, ఏఆర్ఏఐ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో ఈ20 ఇంధనం వినియోగించే వాహనాల ఇంజిన్‌లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందన్నారు. ఈ20 అమలుకు ముందు విస్తృత స్థాయిలో ప్రయోగశాల పరీక్షలు, ఫీల్డ్ ట్రయల్స్, మన్నిక పరీక్షలు నిర్వహించినట్లు గడ్కరీ తెలిపారు. అంతా బాగుందని తెలిసిన తర్వాతే దశల వారీగా దేశవ్యాప్తంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ20 పెట్రోల్ వినియోగించే పాత వాహనాల్లోనూ (2016కు ముందు తయారైన) పనితీరు, ఇంజిన్ అరిగిపోవడం, స్టార్టబిలిటీ, లోహాలు, ప్లాస్టిక్ భాగాల అనుకూలత వంటి అంశాల్లో సమస్యలు కనిపించలేదని వివరించారు.

### ఏపీలో వర్షాలు..

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మేఘావృతమై ఉంటుందన్నారు. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మార్కాపురం, నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### ఆళ్లగడ్డలో ఏం జరిగినా

# సెన్సేషన్‌గా మారుతోంది

చెప్పాలనుకున్న వాటిని పల్లా శ్రీనివాస్‌కు వివరించా. నియోజకవర్గంలోని వివాదాలు, సమస్యలపై పూర్తి స్పష్టత ఇచ్చా. నియోజకవర్గంలో ఏ చిన్న వివాదం తలెత్తినా చెప్పాలని ఆయన సూచించారు. నా తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, శోభ స్థాయికి ఎదగాలని.. వారి పేరు నిలబెట్టేలా పనిచేయాలన్నారు. పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. తెదేపా శ్రేణుల్లో అయోమయం ఉండకూడదనే పల్లా శ్రీనివాస్‌ను కలిశా" అని భూమా అఖిలప్రియ తెలిపారు.

### ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్

# పకడ్బందీగా ఉండాలి

బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. జాబ్ కేలండర్-2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగష్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.

**3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో**

జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్-1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్-2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన అభివర్ణించారు. సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ప్రకృతి మనది కాదు, మనమే ప్రకృతిలో భాగం. కాబట్టి దానితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుంది" అని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అడవుల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రావడం, రైతుల పంటలను నాశనం చేయడం, రాత్రిపూట ప్రజలు భయంతో జీవించడం వంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే 'గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా'ను ఏర్పాటు చేశామని వివరించారు. గతంలో చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో 'జయంత్', 'అభిమన్యు' అనే కుంకీ ఏనుగులు అటవీ శాఖ అధికారులతో కలిసి అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో అక్కడ ఏనుగుల దాడుల్లో మరణాలను 70 శాతానికి పైగా తగ్గించామని, పంట నష్టాన్ని కూడా గణనీయంగా నివారించామని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోనూ అలాంటి విజయాన్నే సాధించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ శిబిరం కోసం నాలుగు కుంకీ ఏనుగులను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "ఏనుగులను బహుమతిగా ఇవ్వడాన్ని అక్కడి ప్రజలు తమ సంపదను పంచుకోవడంతో సమానంగా భావిస్తారు. ఇది వారి ఉదారతకు, స్నేహానికి నిదర్శనం. తెలుగు ప్రజల భద్రతపై ప్రేమతో ఏనుగులను పంపినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన అన్నారు. మానవులు, ఏనుగులు సామరస్యంగా సహజీవనం చేసేందుకు ఈ శిబిరం వేదికగా నిలుస్తుందని ఆశిస్తూ, దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

# నిజమైన భరోసా 'పంట బీమా'

పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం పంటల బీమా నమోదును ఎంతో సులభతరం చేసిందని, పీఎంఎఫ్‌బీవై క్రాప్ ఇన్సూరెన్స్ ఫార్మర్ యాప్ ద్వారా రైతులు స్వయంగా మొబైల్‌లోనే నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్లు, సంబంధిత బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రామ, మండల వ్యవసాయ అధికారుల సహాయంతో కూడా నమోదు చేసుకోవచ్చని వివరించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వచ్చే రసీదు లేదా ధ్రువీకరణ పత్రాన్ని రైతులు తప్పనిసరిగా భద్రపరచుకోవాలన్నారు.

# ఎప్పటికీ వారికి క్షమాపణ చెప్పను

ప్రయత్నించిన ప్రతిసారి మైక్‌ను కట్ చేశారని అన్నారు. "విద్యార్థులపై దాడికి అమిత్ షా బాధ్యులని మాత్రమే చెప్పాను. మాట్లాడే అవకాశం ఇస్తే కదా క్షమాపణ చెప్పే అవకాశం వస్తుంది. అయినా.. ఎప్పటికీ భాజపా, ఆర్ఎస్ఎస్‌కు క్షమాపణ చెప్పను. దేశానికి ఉపయుక్తమైన అంశాలపై మాట్లాడడం విపక్ష నేతగా నా హక్కు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. పెల్లెట్ తగిలి ఓ యువకుడు కన్ను కోల్పోవాల్సి వచ్చింది. ముళ్ల లాఠీలతో మహిళలు, మైనర్లపై దాడులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే దిల్లీ పోలీసులు దాడులకు పాల్పడ్డారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరగాలి. హోంశాఖ మంత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# నన్ను లక్ష్యంగా చేసుకున్నారు

కౌరవులు ద్రౌపది వస్త్రాపహరణకు పాల్పడి ధర్మరాజును అవమానించాలని చూశారని భువనేశ్వరి గుర్తు చేశారు. అదే తరహాలో అసెంబ్లీలో తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసి చంద్రబాబును మానసికంగా దెబ్బతీయాలని ప్రయత్నించారని పరోక్షంగా వైసీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. ధైర్యం ఉంటే మగాడు మగాడిలా నిలబడి ప్రత్యర్థిని ఎదుర్కోవాలని, మహిళలను రాజకీయాల్లోకి లాగడం సమంజసం కాదని అన్నారు. ఓ మహిళ గురించి మాట్లాడే హక్కు ఏ పురుషుడికీ లేదని భువనేశ్వరి స్పష్టం చేశారు. ప్రతి మహిళలకు వాళ్ల వ్యక్తిత్వం గురించి వాళ్ల మనసాక్షికే బాగా తెలుసని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై జరిగిన అవమానం జీవితాంతం మరిచిపోలేనని చెప్పారు. అది ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న వ్యాఖ్యలు కావని, సందర్భం రావడంతో ప్రజల ముందుకు తీసుకొస్తున్న విషయమని వివరించారు. నాడు ద్రౌపదికి శ్రీకృష్ణుడు అండగా నిలిచినట్లే, నేడు చంద్రబాబుకు ప్రజలే దేవుళ్లుగా అండగా నిలిచారని భువనేశ్వరి భావోద్వేగంగా అన్నారు. ప్రజల మద్దతుతోనే ఆ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోగలిగామని చెప్పారు. తనపై జరిగిన ఘటనను గుర్తు చేసుకుంటే ఇప్పటికీ బాధ కలుగుతుందని ఆమె వ్యాఖ్యానించారు.

# మేమేమైనా అంటరానివాళ్లమా?

కూర్చోవడం అంత పెద్ద తప్పా అని ప్రశ్నించిన అంబటి... తెలుగుదేశంలో ఉన్న కాపులతో తప్ప మిగిలిన కాపు నేతలతో ఎవరూ మాట్లాడకూడదని టీటీడీలో ఏదైనా ప్రత్యేక రూల్ ఉందా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. వయసు పెరుగుతున్న కొద్దీ చంద్రబాబుకు బుద్ధి తగ్గుతోందని, తమను అంటరానివారిగా భావిస్తున్నారా? అని నిలదీశారు. కాపు నేతల సభల్లో జనసేన, ఇతర పార్టీల నాయకులు కూడా కలుస్తుంటారని, అంతమాత్రాన అది తప్పైపోతుందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వర్షాల్లేక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. వాటిపై దృష్టి పెట్టకుండా తన పక్కన బొండా ఉమా కూర్చోవడాన్నే చంద్రబాబు పెద్ద సమస్యగా మార్చారని అంబటి ఎద్దేవా చేశారు. ప్రత్యర్థి పార్టీల నేతలతో వేదికలు పంచుకోకూడదనే నెపంతో కాపు ఐక్యతను, నేతల మధ్య సంబంధాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అత్యంత ప్రాధాన్యం : భారత్

శాంతి, స్థిరత్వం సాధించేందుకు దౌత్య మార్గమే సరైనదని భారత్ పునరుద్ఘాటించింది. ఐరాస భద్రతా మండలిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ ఈ నెల హర్మూజ్ జలసంధిలో జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ ఏఐ బహియాహ్, ఎంటీ మొంబాసా నౌకలపై దాడులు జరిగాయన్నారు. ఈ దాడుల్లో పలువురు భారతీయులు గాయపడగా, ఒకరు ప్రాణాలు కోల్పోయారన్నారు. మరో వ్యక్తి గల్లంతయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులపై దాడులు తక్షణమే ఆగాలన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్య అంశమన్నారు. హూతీలు సముద్ర రవాణాపై కొనసాగిస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. బాబ్ ఎల్-మాండెబ్ జలసంధి, దక్షిణ ఎర్ర సముద్ర ప్రాంతంలో నౌకాయానాన్ని కాపాడటం ప్రపంచ దేశాల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.

# 'వందేమాతరం'పై బిల్లును ఆమోదించిన రాజ్యసభ

ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అఠావలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

# తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన మొక్క

**టక్రోటన్ ఉబ్బలమడుగుయెన్సిస్‌గా నామకరణం చేసిన పవన్ కల్యాణ్ - తిరుపతి జిల్లా ఉబ్బలమడుగు జలపాతం సమీపంలో ఆవిష్కరణ**
**అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా వర్గీకరించిన పరిశోధకులు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు కనుమల్లో తాజాగా గుర్తించిన ఒక అరుదైన మొక్క జాతికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. తిరుపతి జిల్లాలోని సుప్రసిద్ధ ఉబ్బలమడుగు జలపాతం సమీపంలో ఈ మొక్కను కనుగొన్న నేపథ్యంలో, ఆ ప్రాంత విశిష్టతను ప్రతిబింబించేలా దీనికి 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్' అని పేరు పెట్టారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) పి.వి. చలపతి రావు నేతృత్వంలోని బృందం, ఉబ్బలమడుగు పరిసరాల్లోని కంబకం కొండల్లో చేపట్టిన విస్తృత పరిశోధనలో ఈ మొక్క వెలుగుచూసింది. యూఫోర్బియేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క తనకు సామీప్యం ఉన్న 'క్రోటన్ అరోమాటికస్' జాతి కంటే భిన్నమైనదని శాస్త్రీయ విశ్లేషణలో నిర్ధారించారు. దీని బాహ్య ఆకృతి, పునరుత్పత్తి లక్షణాలు మరియు సువాసన వెదజల్లే ఆకుల ఆధారంగా దీనిని ఒక కొత్త జాతిగా శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఈ మొక్క అత్యంత పరిమిత ప్రాంతంలోనే లభ్యమవుతుండటం, దాని సహజ ఆవాసానికి ముప్పు పెరుగుతుండటంతో పరిశోధకులు దీనిని అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతిగా వర్గీకరించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవవైవిధ్య సంపదను చాటిచెప్పడమే కాకుండా, ఈ ప్రాంతంలో మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు, సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. ఉబ్బలమడుగు ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించడంతో పాటు, సహజ వారసత్వాన్ని కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ నామకరణం నిదర్శనమని అటవీ శాఖ, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు.

# కంగనా రనౌత్ క్షమాపణ చెప్పాలి : సీపీఐ నారాయణ

**యువత, మహిళలను ఉద్దేశించి కంగన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న నారాయణ**
**బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు సంయమనం పాటించాలని సూచన - సమాజంలో విద్వేషాలు పెంచేలా మాట్లాడటం సరి కాదని వ్యాఖ్య**



**విశ్వం వాయిస్ న్యూస్ :** జెన్ జీ యువత, మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ మండిపడ్డారు. తన వ్యాఖ్యలతో సమాజంలో భావోద్వేగాలను దెబ్బతీసిన కంగన... బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వెల్లడించేటప్పుడు సంయమనం, బాధ్యత వహించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలను పెంచి, ప్రజాస్వామ్య విలువలను కాలరాసేలా కంగనా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇదే క్రమంలో... గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన 'బొద్దింకలు' అనే వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించి, ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నం చేయడాన్ని నారాయణ అభినందించారు. తప్పును గుర్తించి దిద్దుకునే ఇటువంటి వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## భువనమ్మ.. రాజకీయం స్టార్ట్ చేస్తే లెక్క వేరే..!

రాజకీయాల్లో రావాలి.. మేడం అంటూ అక్కడి మహిళలు.. భువనేశ్వరిని కోరుతున్నారు. కుప్పంతో చంద్రబాబు 45 ఏళ్ల అనుబంధం ఉంది.

టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుంది? ఆమె కుప్పం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే.. ఎంత మెజారిటీ వస్తుంది? ఇదేదో పనీ పాటా లేని వారు అంటున్న మాటలు కాదు. కుప్పం నియోజకవర్గంలో మహిళలు.. నేరుగా భువనేశ్వరి ముందే చెబుతున్న మాట. రాజకీయాల్లో రావాలి.. మేడం అంటూ అక్కడి మహిళలు.. భువనేశ్వరిని కోరుతున్నారు. కుప్పంతో చంద్రబాబు 45 ఏళ్ల అనుబంధం ఉంది.

అయితే.. గత పదేళ్లుగా ఈ నియోజకవర్గంతో నారా భువనేశ్వరి కూడా అనుబంధం పెంచుకున్నారు. ముఖ్యంగా వైసీపీ హయాంలో చంద్రబాబు ఓడించేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ఆమె ఎంట్రీ ఇచ్చారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఇక్కడి మహిళలకు ఉపాధి చూపించారు. కొన్ని మండలాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. ఇక, కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి ముందు విజయ యాత్ర పేరుతో నారా భువనేశ్వరి కుప్పంలో పాదయాత్ర కూడా చేశారు.

చంద్రబాబును గెలిపించాలని ఆమె ఆ సమయంలో ఇంటింటికీ తిరిగారు. ఆ తర్వాత.. ప్రభుత్వం ఏర్పడ్డాక.. నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇలా.. తరచుగా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇవన్నీ.. కూడా స్థానికంగా ఉన్న మహిళలను ఆకర్షించాయి. తాజాగా నాలుగు రోజుల పర్యటన కోసం కుప్పం వెళ్లిన సమయంలో భువనేశ్వరికి.. ఇక్కడి మహిళలు రాజకీయాల్లోకి రావాలంటూ.. సూచించారు. కుప్పంలో తిరుగులేని మెజారిటీతో గెలిపించు కుంటామని కూడా చెప్పారు.

అయితే.. సహజంగానే సునిశిత మనస్కురాలైన భువనేశ్వరి.. తనకు, రాజకీయాలకు సరిపోదని సునిశి తంగానే వారి ప్రతిపాదనను తిరస్కరించారు. తనకు రాజకీయాలపై ఇంట్రస్టు లేదని చెప్పారు. అయితే.. మహిళల కోసం.. కుప్పం నియోకవర్గం అభివృద్ధి కోసం.. తాను నిలబడతానన్నారు. ఇప్పటికే తన కుటుంబం నుంచి ఇద్దరు నాయకులు ఉన్నారని.. ఇప్పుడు తనకు రాజకీయాలు చేసే ఆలోచన లేదని చెప్పుకొచ్చారు. కానీ, భువనేశ్వరి కనుక .. ఊ అంటే.. ఇక్కడి మహిళలే ఆమెకు అండగా ఉండి.. ఇంటింటికీ తిరిగి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండడం గమనార్హం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద మృతి



**ఖరగ్‌పూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. హైదరాబాద్‌కు చెందిన పుల్లగురం దీపక్‌రెడ్డి (36) బుధవారం మధ్యాహ్న సమయంలో క్యాంపస్‌లోని స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. సమాచారం అందుకున్న హిజ్లీ ఔట్‌పోస్టు పోలీసులు వెంటనే క్యాంపస్‌లోని బీసీ రాయ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ విషయాన్ని దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు పోలీసులు తెలిపారు. ఆయన గదిని పోలీసులు సీల్ చేసి దర్యాప్తు చేపట్టారు.

## అటవీశాఖ అధికారి ఇంట్లో జడ్పీటీసీ మాజీ సభ్యురాలి భర్త చోరీ

### రూ.26 లక్షల నగదు దొంగతనం..

**కరీంనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇల్లు తాళం వేసి ఉంది.. లోపల శౌచాలయంలో దాచిన రూ.26 లక్షల నగదు మాయమైంది.. బాధితుడు అటవీశాఖ అధికారి కాగా.. చోరీకి పాల్పడిన వ్యక్తి జడ్పీటీసీ మాజీ సభ్యురాలి భర్త కావడం గమనార్హం. కరీంనగర్ రూరల్ ఠాణా పరిధిలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు, విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌కి చెందిన అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి గుడిమల్ల శ్రీనివాస్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లి మణికేశ్వరినగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆయన భార్య సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తుండటంతో శ్రీనివాస్ వారానికోసారి అక్కడికి వెళ్తుంటారు. ఇటీవల స్వగ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని రూ.26 లక్షలకు విక్రయించారు. ఆ నగదును తన అద్దె ఇంటికి తీసుకువచ్చారు. అట్టపెట్టెలో పెట్టి శౌచాలయంలోని ఖాళీ నీళ్ల డ్రమ్ములో దాచారు. గత నెలలో డబ్బు అవసరం ఉండటంతో ఓ రోజు ఆ గదికి వచ్చి చూడగా.. తాళం ధ్వంసం చేసి ఉంది. రూ.26 లక్షలు చోరీకి గురయ్యాయి. తన భార్యకు విషయం తెలిస్తే ఆందోళనకు గురవుతుందని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఇదే క్రమంలో ఆయన అద్దెకు ఉంటున్న ఇంటి కింది అంతస్తులోనూ ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. ల్యాప్‌టాప్ దొంగతనం చేసిన వ్యక్తే తన ఇంట్లోనూ నగదును అపహరించి ఉంటాడని శ్రీనివాస్ నిర్ధారణకు వచ్చారు. గతంలో తన ఇంటికి వచ్చి వెళ్లిన తన స్నేహితుడు, మంథని జడ్పీటీసీ మాజీ సభ్యురాలి భర్త టి.శంకర్‌లాల్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు శంకర్‌లాల్ దొంగతనం చేసినట్లు నిర్ధారించి మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్, శంకర్‌లాల్ మధ్య గతంలో ఆర్థిక లావాదేవీల వివాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరడానికి ప్రయత్నించగా వారు స్పందించలేదు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ మహిళ మృతి



**ఆమనగల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గులకు చెందిన సూదిని పట్టాభి శేఖర్‌రెడ్డి, శశిరేఖ దంపతుల కుమార్తె దీపారెడ్డికి 20 ఏళ్ల క్రితం ఇదే జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి రామకృష్ణారెడ్డితో వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. 18 ఏళ్ల క్రితం న్యూజెర్సీకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం తన భర్త రామకృష్ణారెడ్డిని కారులో ఓ రైల్వేస్టేషన్ వద్ద డ్రాప్ చేసిన ఆమె ఇంటికి బయలుదేరారు. ఓ ప్రధాన కూడలిలో సిగ్నల్ పడటంతో కారును నిలపగా.. అదే సమయంలో వెనుక నుంచి మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో దీపారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. దీపారెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## వారంలో రూ.100 కోట్ల వసూలు

### 25 మిల్లుల్లోనే రూ.287 కోట్ల సన్నధాన్యం మాయమైనట్లు గుర్తింపు
### విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలతో మిల్లర్ల బెంబేలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సన్నధాన్యం గల్లంతు వ్యవహారం ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. ఐకేపీ కేంద్రాల నుంచి సేకరించిన సన్నధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసిన అనంతరం బియ్యాన్ని అప్పగించాల్సిన మిల్లర్లలో కొందరు దారి తప్పడంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆరా తీస్తోంది. దీంతో ధాన్యాన్ని మాయం చేసిన మిల్లర్లు.. సొమ్ము తిరిగి చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. విజిలెన్స్ తనిఖీలు ప్రారంభమైన వారం రోజుల్లోనే సుమారు రూ.100 కోట్ల మేర వసూలైంది. సూర్యాపేట జిల్లాలోని ఒక మిల్లరే.. మంగళవారం రూ.8 కోట్ల పైచిలుకు బకాయిలు చెల్లించడం గమనార్హం.

### ఒక్కో మిల్లులో రూ.20 కోట్లకు పైగా గల్లంతు

గత ఖరీఫ్(2025-26) సీజన్‌లో మిల్లులకు సరఫరా చేసిన సన్నధాన్యంలోంచి 5 లక్షల టన్నుల ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. మిల్లుల్లోని ధాన్యాన్ని 11 లాట్లుగా విభజించి టన్ను ధర రూ.34,050గా నిర్ణయించింది. అయితే ఏ ఒక్క లాట్‌లోనూ అంత ధరను మిల్లర్లు లేదా వ్యాపారులు కోట్ చేయలేదు. గరిష్ఠంగా రూ.27 వేలకే పరిమితం కావడంతో టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. ఈక్రమంలోనే రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందాలు ఈనెల 20 నుంచి కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హుజూరాబాద్.. నల్గొండ జిల్లా డిండి.. సూర్యాపేట జిల్లా బాలెంలతో పాటు మెదక్, నిజామాబాద్, వరంగల్, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటివరకు 25 మిల్లుల్లో రికార్డుల్ని పరిశీలించగా.. రూ.287 కోట్ల మేర సన్నధాన్యం గల్లంతైనట్లు తెలుస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఓ మిల్లులోనే రూ.33 కోట్ల మేర, నల్గొండ జిల్లాలోని మరో మిల్లులో రూ.29కోట్లు.. ఇంకో మిల్లులో దాదాపు రూ.25కోట్లు.. నిజామాబాద్‌లోని మిల్లులో రూ.20 కోట్లకు పైగా విలువైన ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. తాము గుర్తించిన అంశాల ఆధారంగా ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లతో పాటు పౌరసరఫరాలశాఖ విభాగాలకు నివేదికలు ఇస్తూ క్రిమినల్ కేసుల నమోదుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫార్సు చేస్తోంది. ఇప్పటివరకు వచ్చిన నివేదికలతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆగస్టు 5లోగా సొమ్ము చెల్లించాలని మిల్లర్లకు నోటీసులిచ్చారు. వీటికి స్పందించని 10 వరకు మిల్లుల నిర్వాహకులపై కేసులు పెట్టారు. సూర్యాపేట జిల్లాలోని ఒకట్రెండు మిల్లులకు సంబంధించి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై ఇలా కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.




# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




గురువారం, 30 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత    www.viswamvoice.com


# కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా మంత్రి వాసంశెట్టి సుభాష్

## విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం - తల్లికి ఉద్యోగం - మరో బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న రెండు కుటుంబాలకు మొత్తం రూ.25,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఓ కుటుంబానికి ఉపాధి కల్పించి అండగా నిలిచారు. స్థానిక గుబ్బలవారి పేటకు చెందిన పదో తరగతి విద్యార్థి కొమరపు నితిన్ తేజ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి రూ.15,000 ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా, బాలుడి తల్లి గంగాభవానికి వెంటనే ప్రైవేట్ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. అలాగే, 18వ వార్డుకు చెందిన గొలకోటి సత్యనారాయణ అనారోగ్యంతో మంచానికే పరిమితమైన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి, ఆయనకు రూ.10,000 ఆర్థిక సహాయం చెక్కు అందించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న ప్రజల పట్ల మంత్రి సుభాష్ చూపుతున్న మానవీయ దృక్పథం, తక్షణ స్పందనను ఆయా కుటుంబ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు అభినందిస్తూ ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ వెంట ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్ , పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, క్లస్టర్ 2 ఇన్చార్జి కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్,కవల నానాజీ, దిగుమర్తి వీరబాబు,గుబ్బల వెంకటరమణ, మంగతాయారు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా విజయవంతంగా

# పదవీకాలం పూర్తి చేసిన డాక్టర్ పండుల రవీంద్రబాబు



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా విజయవంతంగా పదవీకాలాన్ని పూర్తి చేసిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఐఆర్ఎస్ అధికారి, ఎంబీబీఎస్ వైద్యుడు, అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ పండుల రవీంద్రబాబు (ఐఆర్ఎస్, ఎంబీబీఎస్) ను ఆయన ఏలూరులోని స్వగృహంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీగా తన పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవ, ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ప్రజా జీవితంలో మరింత క్రియాశీలకంగా కొనసాగుతూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

### కే.పెదపూడిలో ఘనంగా

# 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం

## కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కే. పెదపూడి గ్రామంలోని 141వ బూత్ పరిధిలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'రెండేళ్ల నమ్మకం - కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం' అనే నినాదంతో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని, ప్రజల విశ్వాసంతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, కే. పెదపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమనాథం వీరహనుమంతరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, పుల్లేటికుర్రు సొసైటీ సభ్యుడు పెచ్చేటి హరిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉండుర్తి పరంజ్యోతి, చిక్కం పలమరాజు, కుడుపూడి విజయరావు, ఎల్లమెల్లి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొని డోర్ టు డోర్ ప్రచారాన్ని నిర్వహించారు.

### ముమ్మిడివరంలో బూత్ స్థాయి

# కార్యకర్తల సంస్థాగత సమావేశం

**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం నియోజకవర్గం బూత్ స్థాయి కార్యకర్తల సంస్థాగత సమావేశం ఈరోజు ముమ్మిడివరం నియోజకవర్గ బూత్ స్థాయి మొదటి కన్వీనర్( బి ఎల్ ఏ 1) గొల్ల కోటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మహిపాల్ చెరువులోని వి కన్వర్షన్ హాల్ నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోనసీమ జిల్లా ఇంచార్జ్ కారంకి శ్రీనివాస్, కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల, పి ఎం కిసాన్, పి ఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర పథకాలతో పాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు నిజాలు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కార్యదర్శి రుద్రరాజు నరేంద్ర వర్మ, జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, కొప్పనాతి దత్తాత్రేయ వర్మ, ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మండలాధ్యక్షులు యనమంద్ర విజయ్ కుమార్, సఖి రెడ్డి శ్రీనివాస్, సన్నిధి రాజు, వీరభద్ర శర్మ, చప్పిడి శ్రీ దుర్గా, కాట్రేనికోన మండల ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టా సూరిబాబు, రాయపు రెడ్డి, భైరవమూర్తి, ముమ్మిడివరం టౌన్ ఇంచార్జ్ ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ బూత్ స్థాయి రెండవ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### విఘ్నేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా

# తోత్తరమూడి ప్రభాకరరావు నియామకం

## హర్షం వ్యక్తం చేసిన పెదపూడి శ్రీనివాసరావు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, జూలై 29: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా కొండుకుదురు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు తోత్తరమూడి ప్రభాకరరావు నియమితులవడం పట్ల రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో తోత్తరమూడి ప్రభాకరరావు చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సేవలను గుర్తించి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆయన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ తోత్తరమూడి ప్రభాకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

### కాట్రేనికోన పంచాయతీ సిబ్బందితో హరిత రాయబారులతో

# ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు సమీక్ష సమావేశం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం పరిషత్ కార్యాలయం కాట్రేని కోన నందు, పంచాయతీ కార్య దర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది & హరిత రాయ బారులతో ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిరంతరం స్వచ్ఛత కై విశేష సేవలందిస్తున్న హరిత రాయబారులను (క్లాప్ మిత్ర) అభినందించారు.కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగం లోకి తీసుకు రావాలని, ఘన ద్రవ్య వ్యర్థాలను వేరు చేసే విధంగా ప్రజనీకానికి పూర్తి అవగాహన కల్పించాలని హితవు పలికారు.ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.సమీక్షలో డిప్యూటీ ఎంపీడీఓ ఎస్ సూర్య నారాయణ రాజు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది & హరిత రాయబారులు పాల్గొన్నారు.

# శివల విద్యార్థినుల విశేష ప్రతిభ

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి అండర్-17, అండర్-23 బాలికల విభాగాల అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలు ఎస్.కే.పి.జి.ఎన్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. డివిజనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఏ. శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వీరరాఘవరెడ్డి, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ లక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శి ఏ.వి.వి. సత్యనారాయణ సమక్షంలో ఈ పోటీలను సమర్ధవంతంగా నిర్వహించారు. ఈ పోటీలలో శివల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 17 ఏళ్ల లోపు బాలికల విభాగంలో పువ్వల నిత్యశ్రీ జావెలిన్ త్రో క్రీడలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, కోశెట్టి తేజస్విని 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి అమరావతి ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారిణులను శివల పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. కృపలాల్, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారులు ఏ. నాగరాజు, సిహెచ్. ఆంజనేయులు, నీటి సంఘ అధ్యక్షులు ఎన్. సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ సభ్యురాలు వి. నాగమణి, శివప్రసాద్, సంతు కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఇల్లా లక్ష్మి, వైస్ చైర్మన్ పి. రమేష్, కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు జె. సురేష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు అభినందించారు. విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలలోనూ విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### హై వోల్టేజ్‌తో ఇన్వర్టర్ పేలి గాయపడిన

# బాధితుడిని పరామర్శించిన చింతా అనురాధ, పినిపే శ్రీకాంత్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రాన్స్‌ఫార్మర్ హై వోల్టేజ్ కారణంగా ఇంట్లో ఇన్వర్టర్ పేలి గాయపడి అల్లవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవగుప్తం గ్రామానికి చెందిన పద్మనాభం సింహాద్రిని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ, అమలాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. బాధితుడికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కొనుకు బాపూజీ, ఇళ్ల శేషారావు, కొనుకు గౌతమి, సత్యనారాయణ, యల్లమెల్లి సుభాష్ చంద్రబోస్, ఇతకోట రమణ, బర్రె సీతారత్నం, వాసంశెట్టి నరసింహారావు, వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 జిల్లా స్థాయి ఎంపికలు

## కబడ్డీ నుంచి బాక్సింగ్ వరకు పలు క్రీడాంశాల్లో ఎంపికలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "అమరావతి ఛాంపియన్‌షిప్-2026" రాష్ట్ర స్థాయి పోటీల కోసం జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్.రుద్ర తెలిపారు. ఈ ఎంపికలు జూలై 28, 29 తేదీల్లో అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియంలోని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, బాస్కెట్‌బాల్, అర్చరీ, బ్యాడ్మింటన్, యోగా, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, ఆగస్టు 16, 17, 23 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపికలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను అనంతరం ప్రకటిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో ఉదయం సమయానికి హాజరు కావాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సూచించారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



# ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద ఆశీస్సు

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామచంద్రపురం పట్టణంలోని 1, 2, 7, 28 వార్డుల్లో మంత్రి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ వారి అభిప్రాయాలు, సూచనలను సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ



గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలూ కష్టపడి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆకర్షిస్తూ నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే మహిళా సాధికారత కోసం "వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్" లాంటి పథకాలతో ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఫలితాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ 45 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని, ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద బలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, దంగేటి గౌరీ శంకర్, కట్టా నాగేశ్వరరావు, మేడిశెట్టి సూర్యనారాయణ, కడియాల రాఘవన్, పదం మూర్తి, నారపురెడ్డి బలరాం, అల్లం శ్రీనివాస్, ఏసుదాసు, దిగుమతి వీరబాబు, వాసంశెట్టి చంద్రశేఖర్, గడి గోవిందు, కుడుపూడి ఫణి తేజ, పొణకల చంటి, గుబ్బల వెంకటరమణ, రెడ్డి సురేష్, ఉర్రెంకల మంగతాయారుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సాక్షాత్తు భగవంతుడే

# గురువులను ఆశ్రయించాడు : డీఎస్పీ ప్రసాద్

### శ్రీరామకృష్ణ సమితి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సాక్షాత్తూ భగవంతుడే భూమిపై శ్రీకృష్ణుడిగా మానవ రూపంలో అవతరించినప్పుడు సాందీపని మహర్షిని గురువుగా ఆశ్రయించి విద్యలను అభ్యసించారని, అలాగే శ్రీరాముడు వసిష్ఠ మహర్షి, విశ్వామిత్ర మహర్షి వద్ద జ్ఞానాన్ని సంపాదించారని అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ పేర్కొన్నారు. గురువు స్థానం ఎంత విశిష్టమైనదో ఈ సంఘటనలు తెలియజేస్తాయని ఆయన అన్నారు. అమలాపురంలోని శ్రీ రామకృష్ణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గురువుల పట్ల కృతజ్ఞత, గౌరవ భావాలను ప్రతి ఒక్కరూ జీవితాంతం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సమితి సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొన్నాడ పవన్ కుమార్, తిక్కా హిమశంకర్, పుత్సా కృష్ణ కామేశ్వర్, రాజేశ్వరి, పావని, చిక్కాల నాగేంద్రరావు, సి. అన్నపూర్ణమ్మ, నడింపల్లి సీత, బొంతు వీరేశ్వరరావు, వెత్సా సాయి, పేరి లక్ష్మీనరసింహం, లలిత తదితరులు పాల్గొన్నారు.

### కొత్తలంక గ్రామంలో

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తలంక గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కురిడి కొబ్బరి నాఫెడ్ గోడౌన్ దగ్ధమయ్యింది. సుమారు కోటి రూపాయలు విలువ చేసే 2,50,000 కురిడి కొబ్బరి కాయలు మంటలలో ఆహుతయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు మంటలను అదుపు చేశారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధిలో

# మైలురాయిగా భోగాపురం విమానాశ్రయం

## సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

**రాజాం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న భోగాపురం,అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితం చేయనున్న సందర్భంగా, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు భోగాపురంనకు జన సమీకరణ కార్యక్రమంలో భాగంగా, పార్టీ అధిష్టానం రాజాం నియోజకవర్గ అబ్జర్వర్ గా, ప్రభుత్వ విప్ , ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజును నియమించింది, ఈ సందర్భంగా రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నేతలతో సన్నాహన సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో మైలురాయిగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలవనుందన్నారు. భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రతీ ఒక్కరూ కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజాం నియోజకవర్గం నుంచి ఏడువేల మందికి పైగా భోగాపురం పయనం కానున్నారని, మూడురోజుల పాటు నియోజక వర్గంలో జనసమీకరణ ఏర్పాట్లలో నిమగ్నం కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా,యువత, మహిళలు, విద్యార్థులు, కూటమి నాయకులు,ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భోగాపురం విమానాశ్రయం నిర్మిస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త జీ ఎం ఆర్ రాజాం స్థానిక వ్యక్తి కావడం ఇక్కడ ప్రజలకు గర్వకారణం అని కొనియాడారు. విమానాశ్రం



ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఉపాధి, పర్యాటకం, వాణిజ్యం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. సుమారు మూడు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పది వేల బస్సుల్లో ప్రజలు వస్తారని తెలిపారు. అనంతరం రాజాం లో చేసిన అభివృద్ధిని ప్రశంసిస్తూ , డైనమిక్ లీడర్ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అని ఎమ్మెల్యే అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాణ నారాయణ రావు, సుమల వెంకట మన్మథరావు, దూబ ధర్మారావు, వల్లూరి గణేష్, ముగడ శ్రీను వాసరావు, మహేష్,శ్రీను, పి సత్యం నాయుడు, అప్పలనాయుడు, చిట్టి,కోటి, తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో సమగ్ర శిక్ష పనులను

# వేగవంతం చేయాలి : ఏపీసీ మమ్మీ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్ష నిధులతో పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ ఏపీసీ మమ్మీ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం సమగ్ర శిక్ష కార్యాలయంలో బుధవారం సెక్టోరల్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు తదితర పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు

# చినకొత్తలంకలో శ్రీ విజయ దుర్గమ్మ వారికి ఆషాఢం సారె



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామంలో శ్రీపట్టాభి రామ స్వామివారి ఆలయంలో గల శ్రీ విజయ దుర్గమ్మ వారికి గురు పౌర్ణమి సందర్భంగా ఆషాఢం సారె కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పండితుల విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు,మహిళలు, సంప్రదాయ దుస్తులు ధరించి ఆషాఢ సారెతో కలిసి గ్రామ పురవీధులలో మేళతాళాలతో ఊరంతా ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి చెల్లించారు.

### అమలాపురం ఉద్యోగ మేళాలో

# 29 మందికి ఉద్యోగాలు

### కలెక్టరేట్‌లో నియామక పత్రాల పంపిణీ

### మహిళల ధైర్యసాహసాలను అభినందించిన డీఆర్వో సుబ్బారావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఉద్యోగ మేళాలో 29 మంది అభ్యర్థులు వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక య్యారు. జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వీర్ల సుబ్బారావు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేడు పరిశ్రమలు, ఐటీ, వైద్యం, విద్య, పరిపాలన, రక్షణ తదితర రంగాల్లో విశేషంగా రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ముందుకు వచ్చిన మహిళా అభ్యర్థుల ధైర్యసాహసాలను అభినందిస్తూ, వారికి ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులు కూడా ప్రశంసనీయులని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వర్తించి సంస్థలకు మంచి పేరు తీసుకురావడంతో పాటు కుటుంబ సభ్యులకు గర్వకారణంగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని ఇతర యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వికాస జిల్లా మేనేజర్ గొళ్ళ రమేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వికాస ఆధ్వర్యంలో తరచూ ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగలక్ష్మి, మేజిస్ట్రియల్ సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి, లీగల్ సెల్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, వికాస సిబ్బంది పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

### ముమ్మిడివరంలో బీజేపీ బూత్ స్థాయి

# కార్యకర్తల సంస్థాగత సమావేశం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సంస్థాగత సమావేశం మహిపాల్ చెరువులోని వి.కన్వర్షన్ హాల్‌లో నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గ బూత్ స్థాయి మొదటి కన్వీనర్ (బీఎల్ఏ-1) గొల్ల కోటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కోనసీమ జిల్లా ఇంచార్జ్ కారంకి శ్రీనివాస్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యుడు మానేపల్లి అయ్యాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర పథకాలతో పాటు ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ పథకాల వాస్తవాలను ప్రజలకు తెలియజేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కార్యదర్శి రుద్రరాజు నరేంద్ర వర్మ, జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, కొప్పనాతి దత్తాత్రేయ వర్మ, ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మండలాధ్యక్షులు యనమండ్ర విజయ్ కుమార్, సఖి రెడ్డి శ్రీనివాస్, సన్నిధి రాజు, వీరభద్ర శర్మ, చప్పిడి శ్రీ దుర్గా, కాట్రేనికోన మండల ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టా సూరిబాబు, రాయపు రెడ్డి, భైరవమూర్తి, ముమ్మిడివరం టౌన్ ఇంచార్జ్ ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరంలో జిల్లా టీడీపీ సమావేశం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశం ముమ్మిడివరం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకులు సుంకర పావని, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్లు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధితో పాటు, సంక్షేమం కూడా చేస్తుందనిసుంకర పావని పేర్కొన్నారు

### బాలయోగేశ్వర్ల తపో ఆశ్రమంలో

# గురు పూర్ణిమ వేడుకలు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరిం చుకుని ముమ్మిడివరం శ్రీ భగవాన్ బాల యోగేశ్వర్ల తపో ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేక సేవకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి కాశి బాల మునికుమారి తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండపేట పట్టణంలో బురుగుంట చెరువు గట్టున ఉన్న నాలుగు గుళ్ళ వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొని శ్రీ సాయిబాబ వార్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆయన స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించారు. ఆ బాబ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి గణేష్, ఉంగరాల రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భోగాపురం సభకు ప్రత్యేక బస్సులు

### జూలై 31, ఆగస్టు 1న పలు ఆర్టీసీ బస్సులు రద్దు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆగస్టు 1న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు విజయనగరం జోన్ పరిధిలోని ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కేటాయించింది. ఈ నేపథ్యంలో అమలాపురం డిపో పరిధిలోని పలు సాధారణ బస్సు సర్వీసులను జూలై 31, ఆగస్టు 1 తేదీల్లో తాత్కాలికంగా రద్దు చేసినట్లు డిపో మేనేజర్ డీఎల్ఎన్ శర్మ తెలిపారు. ఈ రెండు రోజులలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, ప్రయాణికులు ముందుగానే ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రయాణికులు ఈ తాత్కాలిక మార్పులను గమనించి ఆర్టీసీకి సహకరించాలని డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**పవన్ కళ్యాణ్ కృషితో జిల్లా రైతాంగానికి 'ఏలేరు' నుండి సాగునీరు**

**కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, కాకినాడ జిల్లా రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకుని గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించారని చెప్పారు. ఆరోగ్యం సహకరించకపోయినా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం కాకినాడలో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయించి, ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేసేందుకు అధికారుల అంగీకారం సాధించడం జిల్లా రైతాంగానికి ఎంతో ఊరటనిచ్చే నిర్ణయమని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొని, భవిష్యత్తులో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో రూపొందించిన నివేదికను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అందజేస్తామని చెప్పారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించడంతో పాటు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటి పంపిణీ జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# దస్తావేజు లేఖర్ల ఉపాధిపై ఆర్ఎస్కే కత్తి

**జి.ఓ. 396 రద్దు చేయాలని దస్తావేజు లేఖర్ల గళమెత్తింపు – ఉపాధి రక్షణ కోసం పదో రోజూ కొనసాగిన దస్తావేజు లేఖర్ల సమ్మె**

**ఆర్ఎస్కే విధానంపై దస్తావేజు లేఖర్ల ఆందోళన ఉధృతం – దస్తావేజు లేఖర్ల పోరాటానికి రాజకీయ, కార్మిక సంఘాల మద్దతు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రిజిస్ట్రేషన్ సేవలను ఆధునికీకరణ పేరుతో ప్రభుత్వం అమలు చేయనున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల (ఆర్ఎస్కే) విధానం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధి తీవ్ర సంక్షోభంలో పడే పరిస్థితి నెలకొన్నదనే ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కొనసాగుతున్న నిరవధిక సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అమలాపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పీనిపే శ్రీకాంత్ సందర్శించి దస్తావేజు లేఖర్లకు సంఘీభావం తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న లేఖర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాల వల్ల ఎన్నో సంవత్సరాలుగా ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తలెత్తకూడదని అన్నారు. దస్తావేజు లేఖర్ల సమస్యను రాజకీయ, పరిపాలనా స్థాయిలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దస్తావేజు లేఖర్ల ఉపాధి, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, దస్తావేజు లేఖర్ల అనుభవాన్ని వినియోగించుకునే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ నాయకుడు కొప్పుల సత్తిబాబు సందర్శించి లేఖర్లకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునికీకరణ పేరుతో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న దస్తావేజు లేఖర్లను ఉపాధికి దూరం చేయడం సమంజసం కాదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం అవసరమే అయినప్పటికీ, దాని పేరుతో వేలాది కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీయడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు ప్రజలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆదాయ వృద్ధికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటి వర్గాన్ని పక్కన పెట్టి కొత్త విధానాలు అమలు చేయడం వల్ల అనుభవజ్ఞులైన లేఖర్లు నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జి.ఓ. నెం.396ను వెంటనే ఉపసంహరించుకుని దస్తావేజు లేఖర్ల హక్కులు, ఉపాధికి చట్టపరమైన భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. లేఖర్లతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం స్పందించే వరకు దస్తావేజు లేఖర్ల పోరాటానికి ఏఐటీయూసీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సమ్మెలో పాల్గొంటున్న దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ, తాము ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవల్లో సహకరిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, కొత్త విధానాల వల్ల తమ ఉపాధి పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షుడు గుంటు ఫణిప్రసాద్, కార్యదర్శి పందిరి హరి, బొర్రా బుజ్జి, కడలి సత్యనారాయణ, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వీ శ్రీను, గుమ్మల నరేష్, కె.వి. నాగరాజు, కె. మహేష్, యల్లమెల్లి సత్యనారాయణతో పాటు దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు. దస్తావేజు లేఖర్ల సమ్మె పదో రోజుకు చేరుకోవడం, వివిధ రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించడం ద్వారా ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి, దస్తావేజు లేఖర్ల జీవనోపాధికి రక్షణ కల్పించాలని సమ్మెలో పాల్గొంటున్న వారు విజ్ఞప్తి చేశారు.

## ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. రెవెన్యూ, పోలీసు, ఎన్నికల అధికారులతో కలిసి గోదాములో భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా రెవెన్యూ, పోలీసు, ఎన్నికల శాఖల అధికారులు సంయుక్తంగా గోదామును తనిఖీ చేస్తారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల తనిఖీ నిర్వహించి, నివేదికను భారత ఎన్నికల సంఘానికి పంపాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి టి.తిప్పే నాయక్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

**రైతు బజార్ ఉన్న వ్యాపారస్తులను**

## ఇబ్బంది పెడుతున్న వారి నుంచి రక్షణ కల్పించండి

**రైతు కర్ని వీర్రాజు**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్ బజారులో ఉన్న రైతులను తీవ్ర ఇబ్బంది చేస్తున్నారనీ గత 25 సంవత్సరాలుగా అదే రైతు బజార్లో కూరగాయలు పళ్ళు అమ్ముకుంటున్న రైతులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. అనంతరం బయటకు వచ్చిన రైతులు మీడియాతో మాట్లాడుతూ కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్లో మాకినేని భాస్కర్ అనే వ్యక్తి రైతు బజార్ స్థలాన్ని ఆక్రమించుకుని షాపులు కట్టి రైతుబజార్లో ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అడిగితే తాము రైతులం కాదని ఇక్కడ వ్యాపారాలు చేయనీనని బెదిరిస్తున్నారని వాపోయారు. తామంతా రైతుల నేనని ఎప్పటికప్పుడు ఆద్దులు చెల్లిస్తూ వ్యాపారులు చేసుకున్నప్పటికీ అతను తమపై దౌర్జన్యం చేస్తూ కేసులు పెడుతూ ఇబ్బందులు కురిచేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కర్ని వీర్రాజు. జనసేన నాయకులతో వచ్చి జెసికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన నాయకులు చింతపల్లి బన్నీ మాట్లాడుతూ వ్యవసాయ కమిటీ చైర్మన్ బొచ్చు శేఖర్ అనే వ్యక్తి వైసీపీ నాయకులతో కలిసి కూటమి నాయకులు అన్యాయం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్మన్ బడిగంట దేవి మాట్లాడుతూ చైర్మన్ ను తాను వివరణ కోరగా ఎప్పటి వరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోగా తనకు సమాధానం కూడా చెప్పలేదని అన్నారు. జెసిని కలిసిన వారిలో కోడి శ్రీను, నీలపల్లి కామరాజు, కోరుకొండ కనకారావు, యల్ల సత్తిబాబు, గుండ్రం సతీష్ తదితరులు ఉన్నారు.

## జూలై 31న జర్నలిస్టులు డిమాండ్స్ డే

**జయప్రదానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**



వాతాడ నవీన్ రాజ్



లక్ష్మణ్ ముమ్మిడి

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 31న రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు డిమాండ్స్ డే పాటించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా పిలుపునిచ్చాయని ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ ఏడాది మార్చి 4న విజయవాడలో జరిగిన జర్నలిస్టు ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇచ్చిన హామీల నేపథ్యంలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ప్రధానమైన సమస్యలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు కార్మిక భీమా సదుపాయం, వర్కింగ్ జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు, జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతోపాటు జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, సి ఆర్ మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో తదనుగుణంగా జిల్లాల్లో సమాచార శాఖను బలోపేతం చేసి జర్నలిస్టులకు అవసరమైన సదుపాయాల కల్పన, జర్నలిస్టుల స్థితిగతుల అధ్యయనం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు, ప్రభుత్వ సారథ్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణ తదితర సమస్యలను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేసారు.ఈ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరూ కలిసి రావాలని కోరారు.

## జిల్లా వ్యాప్తంగా ఉచిత ఫలసాయ మొక్కల పంపిణీ



**అమలాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఫలసాయ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆడబాల సత్యనారాయణ ప్రేరణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైతులు తమ అవసరాలకు అనుగుణంగా కావాల్సిన ఫలసాయ మొక్కల వివరాలను సంబంధిత గ్రామ కిసాన్ మోర్చా కమిటీ సభ్యులకు ముందుగానే తెలియజేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఫలవృక్షాల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి రైతులకు పిలుపునిచ్చారు.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి బస్సుల కేటాయింపు

**ఈనెల 31, ఆగస్టు 1 తేదీల్లో రామచంద్రపురం డిపో బస్సులు రద్దు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రామచంద్రపురం డిపో నుండి అధిక సంఖ్యలో బస్సులను కేటాయించడం జరిగింది. ఈ కారణంగా ఈనెల 31వ తేదీ మరియు ఆగస్టు 1వ తేదీల్లో రామచంద్రపురం డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఇంచార్జ్ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్ గారు తెలిపారు. అందువల్ల ఆయా రోజుల్లో సాధారణ ప్రయాణికులతో పాటు వాడపల్లి పుణ్యక్షేత్రానికి వెళ్లే యాత్రికులు కూడా ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాలకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని డిపో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులు ఈ తాత్కాలిక మార్పులను గమనించి యాజమాన్యానికి సహకరించాల్సిందిగా కోరడమైనది.

**లైంగిక వేధింపుల కేసు..**

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆగస్ట్ 11 వరకు ఆయనకు రిమాండ్ విధిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బుధవారం ఉదయం సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ఉదయ్‌ను పోలీసులు అశోక్‌నగర్ తీసుకెళ్లారు. ఆయన ఉంటున్న గదిని అత్తాపూర్ సీఐ సీతయ్య పరిశీలించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని మంగళవారం రాత్రి హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

**కేసు నేపథ్యమిదీ..**

ఈ నెల 18న తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న దర్యాప్తు చేపట్టారు. జాతీయ పోలీసు అకాడమీలో బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా మెడ, గొంతు నులిమినట్లు ఆనవాళ్లు.. చెంప భాగంలో కమిలిన గాయాలు, ఎడమ కాలిపై దెబ్బలున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. నిందితుడికి పోలీసులు నోటీసులిచ్చేందుకు హైదరాబాద్‌లోని రెండు చిరునామాల్లో ప్రయత్నించగా దొరకలేదు. దీంతో 4 బృందాలను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఒంగోలులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి కర్ణాటకకు ప్రయాణమైనట్లు గుర్తించి మరో బృందం అక్కడకు వెళ్లింది. మరో రెండు బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టాయి. ఈక్రమంలో మంగళవారం మిర్యాలగూడ సమీపంలో ఉదయ్‌కృష్ణారెడ్డి ఉన్నట్లు గుర్తించారు. ఆయన వాహనాన్ని పోలీసులు అనుసరిస్తూ హైదరాబాద్‌కు చేరగానే అదుపులోకి తీసుకున్నారు.

**శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చిన**

## శ్రీ బాలా త్రిపురసుందరి అమ్మవారు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆషాడం సందర్భంగా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కాకినాడ శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని శాకాంబరీ దేవిగా అద్భుతంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వీర్రాజు చౌదరి మాట్లాడుతూ ఐదు టన్నుల వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో ఆలయ గర్భగుడిని, అమ్మవారి మూలవిరాట్టును నయన మనోహరంగా అలంకరించడం జరిగిందని తెలిపారు. ఈ విశేష అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడం జరుగుతుందన్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరిగిందన్నారు. అందజేశారు. అమ్మవారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దర్శించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రోబోటిక్, అధునాతన శస్త్రచికిత్సా విధానాలతో

# స్థూలకాయం సమస్యల నుంచి పరిష్కారం

## ఆధునిక బేరియాట్రిక్ వైద్యంతో ప్రాణాలు కాపాడుతున్న యశోద హైటెక్ సిటీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోవిడ్ మహమ్మారి కంటే స్థూలకాయం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య ముప్పుగా మారిందని యశోద ఆసుపత్రులు, హైటెక్ సిటీ విభాగానికి చెందిన రోబోటిక్, బేరియాట్రిక్ శస్త్రచికిత్సల నిపుణుడు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక కేలరీల ఆహారం తీసుకోవడం, ఆన్‌లైన్ ఆహార సరఫరా సేవలపై పెరుగుతున్న ఆధారపడటం వల్ల ఊబకాయం విస్తరిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్థూలకాయ సమస్యతో బాధపడుతున్నారని, భారత్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో శారీరక శ్రమకు దూరమవుతున్న జీవన విధానం కారణంగా ఈ సమస్య వేగంగా పెరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ స్థూలకాయంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం భవిష్యత్ ఆరోగ్య సమస్యలకు సంకేతమని పేర్కొన్నారు. స్థూలకాయం కేవలం శరీర ఆకృతికి సంబంధించిన సమస్య కాదని, మధుమేహం, కొవ్వు కాలేయం, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు తదితర అనేక అనారోగ్యాలకు ప్రధాన కారణమవుతోందని డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి వివరించారు. కొంతమందిలో సంతానలేమి సమస్యలకు కూడా అధిక బరువు కారణమవుతుందని తెలిపారు. బేరియాట్రిక్ శస్త్రచికిత్సను కేవలం అందం కోసం చేయించుకునే చికిత్సగా భావించడం సరికాదన్నారు. శరీర ద్రవ్యరాశి సూచీ అధికంగా ఉండి, స్థూలకాయం కారణంగా తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న అర్హులైన వారికి వైద్య పరీక్షల అనంతరం ఈ శస్త్రచికిత్సను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరం లేని వారికి శస్త్రచికిత్స చేయకుండా, వైద్యపరంగా అవసరమైన వారినే ఎంపిక చేస్తున్నామని చెప్పారు. యశోద హైటెక్ సిటీలో నిర్వహిస్తున్న ఆధునిక జీవక్రియ శస్త్రచికిత్సల ద్వారా అధిక బరువును తగ్గించడంతోపాటు మధుమేహం, కొవ్వు కాలేయం వంటి సమస్యల్లో గణనీయమైన మార్పులు సాధిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్, అధునాతన శస్త్రచికిత్సా విధానాలతో రోగులకు మెరుగైన ఫలితాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. స్థూలకాయం తీవ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు యశోద హైటెక్ సిటీ బృంద సభ్యులు జి. సంతోష్‌కుమార్, ఎస్.వి.వి. రామకృష్ణ, సాయి కిరణ్ వి. కృషి చేస్తున్నారని తెలిపారు. స్థూలకాయాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో నిపుణులైన వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందితే స్థూలకాయం కారణంగా వచ్చే అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచించారు.

వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి

# ముని కూడలి ఘాట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలి ప్రసిద్ధ సప్తఋషి ఘాట్ వద్ద రానున్న పుష్కరాలను దృష్టి లో ఉంచుకొని భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలగ కుండా ప్రతిష్టమైన ఏర్పాట్లు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా పరిశీలించారు ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఐఏఎస్ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ మరియు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి భక్తుల వెంకటలక్ష్మి పరిశీలించారు.

కలియుగ ప్రత్యక్ష దైవం

# శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పెందుర్తి అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ (క్యాబినెట్ మినిస్టర్ హోదా) పెందుర్తి వెంకటేష్ తనయుడు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమం తోమాల సేవలో పాల్గొని కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దేవుడు మరింత శక్తినివ్వాలని రాజానగరం నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించానన్నారు.

మహిళా సంఘాలకు

# రూ.4.62 లక్షల డివిడెండ్ పంపిణీ

### చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం పరిధిలోని శ్రీ సూర్యతేజ లక్ష్మీ మహిళా సమాఖ్యకు వచ్చిన లాభాల నుండి స్వయం సహాయక సంఘాలకు రూ.4,62,000/-లను డివిడెండ్ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యతేజ లక్ష్మీ సమాఖ్య సభ్యులు లాభాలు ఆర్జించి డివిడెండ్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మండపేటలోని ఇతర సమాఖ్యలు కూడా ఇదే బాటలో నడవాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సంఘాల కోసం "మన డబ్బు మన లెక్కలు" అనే కొత్త యాప్‌ను తీసుకొచ్చిందని, దీని ద్వారా సంఘ సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలు, బ్యాలెన్స్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. అదే సమయంలో వివిధ బ్యాంకులు సంఘాల రుణాలపై వేరు వేరు వడ్డీ రేట్లు, రకరకాల చార్జీలు వసూలు చేస్తున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. బ్యాంకుల వారీగా వడ్డీ రేట్లు మరియు చార్జీల వివరాలతో నివేదిక తయారు చేసి ఇవ్వాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంద్యాల సుజాతను ఆదేశించారు. ఈ సమస్యను రాబోయే జిల్లా బ్యాంకర్స్ మీటింగ్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డ్ టిడిపి ఇన్ ఛార్జ్ మహమ్మద్ కరీం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లంకలపల్లి రాంబాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. శ్రీ రమ్య, ఎస్ బి ఐ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్రావు, కమ్యూనిటీ ఆర్గనైసర్ ఇంత కిరణ్ రాంజీ, సమాఖ్య సభ్యులు రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా

# నరసన్నకు గిరి ప్రదక్షణ

### నరసన్న నామంతో మార్మోగిన కోరుకొండ



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని సాయంత్రం నరసన్న భక్తులు పెద్ద ఎత్తున నరసన్న నామస్మరణలతో గిరిప్రదక్షిణ గావించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి, గిరి ప్రదక్షణ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్న భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా బాబావారికి

# పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు

### - భక్తులకు భారీ అన్న సమారాధన



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయిబాబా ఆలయాల్లో పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుండి భక్తులు బాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరుకొండ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయం, కోరుకొండ శిరిడి నగర్ ఆలయం, బూరుగుపూడి, కనుపూరు, గాదరాడ తదితర గ్రామాల్లో బాబావారికి పంచామృత అభిషేకాలు, వివిధ ఫలపుష్పాలతో బాబావారిని సర్వంగ సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురు పౌర్ణమి సందర్భంగా పలువురిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం దాతల సహాయ సహకారాలతో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీసభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెండేళ్ల కూటమి పాలనలో

# ప్రజలు సంతృప్తి : ఎమ్మెల్యే వేగుళ్ళ



**కపిలేశ్వరపురం మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, వేగవంతమైన అభివృద్ధి పట్ల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికీ వెళ్తూ కూటమి ప్రభుత్వ పాలన, లబ్ధిదారులకు అందుతున్న పథకాలపై ప్రజాభిప్రాయాన్ని నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్తున్న సమయంలో ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, వారి ముఖాల్లోని సంతోషం ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ ఎలాంటి భయాలు లేకుండా అత్యంత స్వేచ్ఛగా, ఆనందంగా జీవిస్తున్నారని స్పష్టం చేశారు. కోరుమిల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ.3 కోట్ల 26 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి మరియు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారల ఆలయాల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆచంట సత్యనారాయణ, కొండిశెట్టి నాగేశ్వరరావు, మోటుపల్లి బాపిరాజు, కాకులపాటి సుబ్రహ్మణ్యం, సుంకర ధర్మరాజు, కొండిశెట్టి నరసన్నారాయణ, కొండిశెట్టి సూర్యరావు, ఆచంట శ్రీనివాసరావు, తుట్టుపు నాగరాజు, తుట్టుపు లోవరాజు, అర్లపల్లి పట్టాభిరామయ్య, పెద్దిరెడ్డి సత్తిబాబు, అరిగెల పాపారావు, కపిలేశ్వరపురం మండల టిడిపి అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, రాష్ట్ర కుమ్మరి సాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ మాచవరపు విజయకుమారి, అమలాపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో మండల స్థాయి

# నిఘా కమిటీ ఏర్పాటు

### తహసిల్దార్ తేజేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం మండపేట మండల స్థాయి నిఘా కమిటీని ఏర్పాటు చేసినట్లు మండపేట తహశీల్దార్ పి తేజేశ్వరరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ సివిల్ సప్లైస్ ఈ ప్రతిపాదనలను ఆమోదించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ ఎఫ్ ఎస్ చట్టం కింద అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, మధ్యాహ్న భోజనం, ఐసిడిఎస్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో సరఫరా అయ్యే ఆహార ధాన్యాలు, భోజనాన్ని తనిఖీ చేస్తారన్నారు. చట్ట ఉల్లంఘనలు లేదా నిధుల దుర్వినియోగం జరిగితే జిల్లా ఫిర్యాదుల పరిష్కార అధికారికి రాతపూర్వకంగా నివేదించడం కమిటీ బాధ్యతల్లో ఉందన్నారు. ఈ కమిటీకి తహశీల్దార్ పి. తేజేశ్వరరావు చైర్మన్‌గా, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ కో-చైర్మన్‌గా, డిప్యూటీ తహశీల్దార్ జి.శ్రీనివాస్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎంపిడిఓ, ఎం ఇ ఓ, ఐ సి డి ఎస్ సూపర్వైజర్, ఎస్ హెచ్ జీ స్వచ్ఛంద సంస్థలు, మీడియా, ఎస్ సి, ఎస్ టి మహిళా ప్రతిన.

10వ రోజుకు చేరిన

# దస్తావేజు లేఖర్ల నిరసన దీక్షలు

### - పలు గ్రామాల నుంచి రైతులు మద్దతు




**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేసి దస్తావేజులేఖల కుటుంబాలను ఆదుకోవాలని కోరుకొండ దస్తావేజు లేఖర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కోరుకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద లేఖర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరుకున్నాయి. దస్తావేజులేఖలకు పలు గ్రామాల నుండి ఎన్డిఏ నాయకులతో పాటు పలు గ్రామాల రైతులు మద్దతు తెలియచేస్తున్నారు. ఈ సందర్భంగా దస్తావేజులేఖర్ల సంఘ అధ్యక్షులు పెద్దపాటి భీమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టుదలకు పోకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదులక్షల దస్తావేజులేఖర్ల కుటుంబాలు వీధిని పడకుండా, మానవతా దృక్పథంతో జీవో నెంబర్ 396ను రద్దు చేసి, తమను అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.








న్యాచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నాని జోడిగా అందాల భామ కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుంది. నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం ప్యారడైజ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు. నాని సినిమా కోసం ఆడియన్స్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. నాని సినిమాలకు మినిమమ్ గ్యారెంటీ ఉంటుంది. ఫ్యామిలీ మొత్తం వెళ్లి చూసి ఎంజాయ్ చేసేలా ఉంటాయి. అది ఏ జోనర్ సినిమా అయినా నాని సినిమా అంటే చాలు ఫ్యాన్ థియేటర్స్ కు క్యూ కడతారు. ఇక దసరాలాంటి మాస్ మసాలా సినిమా తర్వాత హాయ్ నాన్నలాంటి ఫ్యామిలీ సినిమాతో కట్టిపడేసాడు. తర్వాత సరిపోదా శనివారం, హిట్ 3 సినిమాలతో హిట్స్ అందుకున్నారు. నాని ఆతర్వాత ఇక ఇప్పుడు ప్యారడైజ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది ఈ సినిమా. నాని, సోనాలి కులకర్ణి, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఇక ఈ సినిమాలో నాని జోడిగా కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుంది. అయితే కొన్ని రోజులుగా ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ పాట కోసం ముందుగా తమన్నాను అనుకున్నప్పటికీ.. అనుహ్యంగా ఆతర్వాత మరో హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది ఆ ముద్దుగుమ్మే పూజా హెగ్డే. కానీ ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తుంది. ఆమె ఎవరో కాదు కీర్తిసురేష్. ది ప్యారడైజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసేందుకు కీర్తిసురేష్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. గతంలో నేను లోకల్, దసరా సినిమాల్లో కీర్తిసురేష్ నానికి జోడీగా నటించింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడు ప్యారడైజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుందని ప్రచారం జరుగుతుంది. ఈవార్తల్లో వాస్తవం ఎంత అన్నది తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

## అప్పుడు టీవీ ఛానెల్ యాంకర్.. ఇప్పుడు కోట్ల ఆస్తులకు యువరాణి, సొంత దీవి కూడా ఉంది



సినిమా గ్లామర్ ప్రపంచంలో ఆమె టాప్ హీరోయిన్లలో ఒకరు. నటనపై ఆసక్తితో ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలలో దూసుకుపోతుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన ఆమె.. జర్నలిజం చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఓ ఛానల్లో రిపోర్టర్ గా జాబ్ చేసింది. సినిమా గ్లామర్ ప్రపంచంలో ఆమె టాప్ హీరోయిన్లలో ఒకరు. నటనపై ఆసక్తితో ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలల లో దూసుకుపోతుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన ఆమె.. జర్నలిజం చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఓ ఛానల్లో రిపోర్టర్ గా జాబ్ చేసింది. కానీ నటనపై ఆసక్తి ఉన్న ఆమె.. న్యూస్ రూమ్ నుంచి చలనచిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేసేలా చేసింది. ఇప్పుడు సొంతంగా ఐల్యాండ్ , కోట్ల ఆస్తి ఉన్న హీరోయిన్ ఆమె. ఆ హీరోయిన్ మరెవరో కాదండి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. సిడ్నీ విశ్వవిద్యాలయం నుండి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి శ్రీలంకకు తిరిగి వచ్చింది. అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన అలాడిన్ అనే ఫాంటసీ డ్రామాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఐఫా స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. 2011లో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ మర్డర్ 2 మూవీతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. హౌస్‌ఫుల్ 2, రేస్ 2, కిక్ వంటి చిత్రాలతో హిట్లు అందుకుంది. జాక్వెలిన్ ఎక్కువగా స్పెషల్ పాటలతో ఫేమస్ అయ్యింది. అలాగే శ్రీలంకలో సొంతంగా ద్వీపం కొనుగోలు చేసిందట. ప్రస్తుతం బాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. ముంబైలో జాక్వెలిన్‌కు 5 బిహెచ్‌కె అపార్ట్‌మెంట్ కూడా ఉందని టాక్. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ 2009లో అల్లాదీన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. కెరీర్ బిగినింగ్ లో ఓ టీవీ ఛానెల్‌లో యాంకర్‌గా చేసింది. హౌస్‌ఫుల్, మర్డర్ 2, కిక్ , రేస్ 2తో సహా 35కి పైగా చిత్రాలలో నటించింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తన గ్లామరస్ ఫొటోలతో ప్రేక్షకులను కవ్విస్తుంది. రకరకాల ఫొటోలు వీడియోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది.




### ఐపీఎల్ బిజినెస్ విలువ 20 బిలియన్ డాలర్లు+..

# టాప్ బ్రాండ్‌గా ఆర్సీబీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ తొలిసారి 20 బిలియన్ డాలర్ల (1.9 లక్షల కోట్లు) మార్క్‌ను దాటేసింది. అదే విధంగా ఐపీఎల్‌లో టాప్ బ్రాండ్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. వరుసగా రెండు సీజన్లలో కప్పును సొంతం చేసుకున్న ఆర్సీబీ తన మార్కెట్‌ను పెంచుకుంది. ప్రస్తుతం ఆర్సీబీ విలువ 300 మిలియన్ డాలర్లకుపైగా ఉంది. 2026లో ఐపీఎల్ విలువను హౌలిహాన్‌లోకి స్టడీ చేసి నివేదికను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే లీగ్ బిజినెస్ విలువ 11.4 శాతం పెరిగినట్లు పేర్కొంది.

మూడేళ్ల కిందట ఐపీఎల్ బిజినెస్ విలువ 15.4 బిలియన్ డాలర్లు (రూ.1.47 లక్షల కోట్లు) ఉండేది.

2025 నాటికి 18.5 బిలియన్ డాలర్లు (రూ. 1.75 లక్షల కోట్లు)

ఈ ఏడాది ఐపీఎల్ బిజినెల్ విలువ 20.6 బిలియన్ డాలర్లు (రూ. 1.90 లక్షల కోట్లు)కు పెరిగింది.

మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ల విక్రయాలు కలిపి మొత్తం ఆదాయం 1.8 బిలియన్ డాలర్లు (రూ. 1.70 లక్షల కోట్లు) దాటిందని నివేదిక అంచనా వేసింది.

విలువ పరంగా తొలి స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉండగా.. ఆ తర్వాత వరుసలో ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, దిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఉన్నాయి.

# టాపర్లు మనోళ్లే..

### వైభవ్ సూర్యవంశీ మొదలుపెట్టాడు



టీమ్ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐసీసీ ర్యాంకుల్లో వేట మొదలుపెట్టాడు. ఇంగ్లాండ్‌పై అరంగేట్రం చేసిన అతడు.. ఆ టీ20 సిరీస్‌లో ప్రభావం చూపించలేదు. కానీ, జింబాబ్వేపై విజృంభించిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. మూడు టీ20ల్లో 151 పరుగులు చేశాడు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 230 స్థానాలను ఎగబాకడం గమనార్హం. దీంతో అనతికాలంలోనే వైభవ్ టాప్ -50లో అడుగు పెట్టాడు. ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో ఉన్నాడు.

**ఇషాన్ 1.. అభిషేక్ 3**

టీ20ల్లో అగ్రస్థానం భారత క్రికెటర్ ఇషాన్ కిషన్‌దే. అతడు 910 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్‌పై ఫర్వాలేదనిపించిన అభిషేక్ శర్మ జింబాబ్వేపై తేలిపోయాడు. దీంతో అతడి ర్యాంక్‌పైనా ప్రభావం పడింది. ఒక స్థానం కోల్పోయిన అభిషేక్ (819) మూడో ర్యాంకుకు పడిపోయాడు. పాకిస్థాన్ ఆటగాడు సహిబ్జాద ఫర్హాన్ (848) రెండో ర్యాంకుకు చేరాడు. తిలక్ వర్మ (750) రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టీ20 బౌలింగ్ విభాగంలో టాప్ -10లో భారత్ నుంచి ఒకే ఒక్క బౌలర్ మాత్రమే ఉన్నాడు. వరుణ్ చక్రవర్తి (663) మూడు స్థానాలను కోల్పోయినా 9వ ర్యాంకులో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు స్థానాలను కోల్పోయాడు. ప్రస్తుతం 17వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.

**వన్డేల్లో శుభ్‌మన్ గిల్ టాప్ ప్లేస్**

వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న కివీస్ ఆటగాడు డారిల్ మిచెల్ (794) రెండో స్థానానికి పడిపోయాడు. గిల్ ఖాతాలో ప్రస్తుతం 801 పాయింట్లు ఉన్నాయి. టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలింగ్ విభాగంలో భారత్ నుంచి టాప్-10లో ఒక్కరూ లేరు. కుల్‌దీప్ యాదవ్ (596) మాత్రం 11వ స్థానంలో ఉన్నాడు. ఇక జట్లపరంగా.. వన్డే, టీ20ల్లో టీమ్ఇండియా అగ్రస్థానంలో ఉంది. టెస్టుల్లో మాత్రం నాలుగో ర్యాంకులో నిలిచింది. టీ20ల్లోనూ ఇంగ్లాండ్ (268)తో భారత్ (268)కు తీవ్ర పోటీ తప్పడం లేదు.




# బీసీసీఐ కొత్త ప్రణాళికలు.. షమీ కెరీర్ ఇక ముగిసినట్లేనా?

మెగా టోర్నీల్లో అడుగు పెడితే.. వికెట్ల వర్షం కురిపిస్తాడు. ద్వైపాక్షిక సిరీసుల్లో కంటే ఐసీసీ ఈవెంట్లలో సత్తా చాటడమే ఇష్టపడతాడు. మరి అలాంటి సీనియర్ స్టార్ పేసర్ షమీకి టీమ్ఇండియా తలుపులు తెరుచుకోవడం లేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కూ అతడిని ఎంపిక చేయలేదు. తాజాగా మరొక పిడుగులాంటి కథనం ఈ సీనియర్ పేసర్ పాలిట చేదు గుళికలా తయారైంది. టీమ్ఇండియా వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ చివరిసారిగా జాతీయ జట్టుకు ఆడి సంవత్సరం దాటిపోతోంది. గత ఛాంపియన్స్ ట్రోఫీ చివరి వన్డే ఆడాడు. అదే ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో చివరి టీ20లో తలపడ్డాడు. ఇక టెస్టు మ్యాచ్ ఆడి కూడా మూడేళ్లు దాటిపోయింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. గత ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ షమీనే కావడం గమనార్హం. ఇక దేశవాళీలోనూ పశ్చిమ్ బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించిన షమీ.. కేవలం ఏడు మ్యాచుల్లోనే 37 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. యువ బౌలర్లతో పోటీ పడి మరీ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. బుమ్రాతో షమీ కలిస్తే టీమ్ఇండియా పేస్ మరింత పదునెక్కడం ఖాయం. కానీ, 35 ఏళ్ల సీనియర్‌ను కాదని.. యువ పేసర్ల వైపు బీసీసీఐ సెలక్టర్లు దృష్టిసారించారు. గత వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ బౌలింగ్ మెరుపులే లేకుండా ఉంటే.. టీమ్ఇండియా ప్రదర్శన ఆ స్థాయిలో ఉండేది కాదు.

**15 మందితో కూడిన..**

మొన్నటి వరకూ ఏదొక సమయంలో షమీకి అవకాశం దక్కుతుందని అతడి అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ, బీసీసీఐ సెలక్టర్లు 15 మందితో కూడిన యంగ్ పేస్ పూల్‌ను సిద్ధం చేశారనే వార్త ఇప్పుడు షమీ ఆశలకు తెరిదించినట్టైంది. రాబోయే టెస్టు ఛాంపియన్‌షిప్, 2027 వన్డే ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా ఎక్కువగా కుర్రాళ్లకే అవకాశం ఇవ్వాలనేది గంభీర్ - అగార్కర్ కాంబో ప్రణాళిక. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ నడుస్తోంది. ఇందులో టీమ్ఇండియా ఫైనల్‌కు వెళ్లే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయి. దీంతో 2027-29 సైకిల్‌పైనా ఫోకస్ పెట్టేలా పేస్ దళాన్ని సిద్ధం చేయడం కూడా మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో ఒకటి. ఇప్పటికే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో పరివర్తన దశ మొదలైంది. సీనియర్ల స్థానాల్లో యువకులు వచ్చేస్తున్నారు.

**షమీ ఏం చేస్తాడో?**

ఇప్పుడున్న యువ పేసర్లలో నిలకడ లేదనేది కాదనలేని వాస్తవం. బుమ్రాకు సరైన సహకారం ఇవ్వడంలో ప్రసిద్ధ్, సిరాజ్, అర్ష్‌దీప్ విఫలమవుతున్నారు. ఏదో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే మంచి ప్రదర్శన ఇస్తున్నారు. గాయాల కారణంగా బుమ్రా దూరమైన స్థితిలో కుర్రాళ్లను ముందుండి నడిపించే బాధ్యతను సీనియర్ షమీకి ఇస్తే బాగుంటుందనేది చాలామంది భావన. జట్టు పరివర్తనకు షమీ అనుభవం కూడా పనికొస్తుందని వారి వాదన.



హార్డ్ లెంగ్త్ వేయడంలో షమీ దిట్ట. అతడు ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అవసరమూ లేదు. వయసు కారణంగా చూపిస్తుండటం మాత్రం షమీకి ప్రతికూలంగా మారింది. కానీ, ఫిట్‌నెస్‌తోపాటు ఫామ్ ఉంటే అదేమంత సమస్య కాదు. ఈ విషయంలోనూ బీసీసీఐ పెద్దలు ఆలోచన చేయాలనేది క్రీడా పండితుల సూచన. ఇలాగే పక్కన పెడుతూ ఉంటే మాత్రం త్వరలోనే షమీ నుంచి 'వీడ్కోలు' ప్రకటన వచ్చే అవకాశం లేకపోలేదు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com